

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పనులు 6లో..

రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి కృషి 6లో..



పాల సరఫరాలో మాయాజాలం

- ఎమ్మార్పీకి మించి అదనంగా చెల్లిస్తున్న వైనం
- విజయ డెయిరీ లీటర్ పాల ధర రూ. 58, చెల్లించేది రూ. 60
- ఎస్‌డబ్ల్యూ గురుకుల పాఠశాలల టెండర్ గుడ్డిగా ఖరారు
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వ్యవహారం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయాలకు పాల సరఫరా చేసే టెండర్లలో మాయాజాలం జరిగింది. పాల సరఫరా దారుడు టెండర్‌లో కోట్ చేసిన ధరకే అధికారులు గుడ్డిగా టెండర్ ఖరారు చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మార్కెట్‌లో వాస్తవ ధరలు ఎంత ఉన్నాయో తెలుసుకోకుండానే టెండర్ ఖరారు చేశారు. దీని పర్యావసానంగా ఏడాదికి ప్రభుత్వానికి ఆరు లక్షల నుంచి ఏడు లక్షల రూపాయల వరకు నష్టపోయే పరిస్థితి నెలకొన్నది. జిల్లాలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు మల్లాపూర్, గర్రెపల్లి, మంథని, రామగుండం, నందిమేడారం, పెద్దపల్లిలో ఉన్నాయి. వీటిల్లో 500 నుంచి 700 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనాలు, అల్పాహారాలు, పాలు ఇచ్చేందుకు గాను వేర్వేరుగా టెండర్లు నిర్వహిస్తుంటారు. కిరాణ సరుకులు, కోడిగుడ్లు, పాలు నెయ్యి, కూరగాయలు, వంట చెరుకు లేదా వంట గ్యాస్ తదితర సరుకుల కోసం ప్రతి ఏటా పాఠశాలలు ఆరంభం అయ్యే సమయంలో జూన్, జూలై నెలలో వేర్వేరుగా టెండర్లు ఆహ్వానిస్తారు. టెండర్ల నిర్వహణకు జిల్లాస్థాయిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. టెండర్లు దక్కించుకునేందుకు సంబంధిత కాంట్రాక్టర్లు మార్కెట్ ధరలను బట్టి ధరలను కోట్ చేస్తారు. వచ్చిన టెండర్లను కాంట్రాక్టర్ల సమక్షంలోనే ఓపెన్ చేసి నెగోషియేట్ చేసి ఖరారు చేస్తారు. పాల టెండర్లకు సంబంధించి ఏం జరిగిందో, ఎలా జరిగిందో తెలియదు గానీ, లీటర్ పాలను ఎమ్మార్పీకి మించి రెండు రూపాయలు ఎక్కువగా ఖరారు చేశారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రొసీడింగ్ ఆర్‌సీ నంబర్, డీసీఓ/5/మిల్క్/2023-24, తేదీ: 14-7-2023 రోజున సంబంధిత గురుకుల పాఠశాలలకు ఉత్తర్వులు జారీ చేశారు.

● జిల్లాలోని ఆరు గురుకులాల్లో..

జిల్లాలోని ఆరు గురుకుల విద్యాలయాల్లో విజయ డెయిరీ పాలను వినియోగించాలని, మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన వీవా విజయ మిల్క్ ఏజెన్సీ వాళ్ల లీటర్ పాలు (టోన్డ్ మిల్క్) 60 రూపాయలకు, లీటర్ నెయ్యి 630 రూపాయలకు సరఫరా చేయనున్నారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వాస్తవానికి ప్రస్తుతం మార్కెట్‌లో అర లీటర్ ప్యాక్ గల పాల ధర 29 రూపాయలు ఉంది. అంటే లీటర్‌కు 58 రూపాయలకు విక్రయిస్తున్నారు. వాస్తవానికి టెండర్ ద్వారా వచ్చే సరుకులు ఓపెన్ మార్కెట్‌లో లభించే ధర కంటే రూపాయి తక్కువగానే కోట్ చేస్తూ ఉంటారు. బయట మార్కెట్‌లోనే లీటర్ పాలు 58 రూపాయలకు లభిస్తుంటే, అధికారులు లీటర్ పాలకు 60 రూపాయల ధర నిర్ణయించడం విడ్డూరంగా ఉంది. ఒక్కో గురుకుల పాఠశాలలో 80 నుంచి 100 లీటర్ల వరకు పాలను మెనూ ప్రకారం వినియోగిస్తూ ఉంటారు. నెలకు 2,400 నుంచి 3,000 లీటర్లు అవసరం ఉంటాయి. ఏడాదిలో సెలవులు పోనూ 10 నెలల పాటు గురుకులాలు నడిచి ఉంటే 24 వేల నుంచి 30 వేల లీటర్ల వరకు పాలను వినియోగిస్తున్నారు. పాలకు ఎమ్మార్పీకి మించి అదనంగా రెండు రూపాయలు చెల్లిస్తున్నారు. 48 వేల నుంచి 60 వేల రూపాయల వరకు ఒక గురుకుల విద్యాలయం పేరిట కాంట్రాక్టర్‌కు చెల్లిస్తున్నారు. ఆరు గురుకులాలకు కలిపి ఏడాదికి 2,88,000 నుంచి 3,60,000 రూపాయలు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ టెండర్‌లో ఎమ్మార్పీ కంటే ఒకటి, రెండు రూపాయలు తక్కువ కోట్ చేస్తే ప్రభుత్వంపై రెండు నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఆదా అయ్యేది. ఒక్క పాల మీదనే ప్రభుత్వం ఏడాదికి ఏడు లక్షల రూపాయల వరకు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పాల టెండర్లను సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ కోట్ చేసిన ధరలను మార్కెట్ ధరలకు సరిచూసిన తర్వాత ఖరారు చేశారా, అవేమి పట్టించుకోకుండానే ఖరారు చేశారా అనే విషయం తెలియడం లేదు. ఇప్పటికే ఆరు మాసాలు గడిచింది. ఈ విషయమై కలెక్టర్ స్పందించి పాల టెండర్లను పునః సమీక్షించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'గ్యాస్ డోర్ డెలివరీ పేరిట దోపిడీ' అనే శీర్షికన ఈ నెల 23న ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో ప్రచురితమైన కథనానికి అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ స్పందించారు. ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసే సమయంలో వినియోగదారుల నుంచి ఎటువంటి అదనపు డెలివరీ చార్జీలు వసూలు చేయరాదని డీలర్లను ఆదేశించారు. శనివారం అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని ఎల్‌పీజీ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఎల్‌పీజీ డీలర్లు గ్యాస్ సిలిండర్లు సరఫరా చేసినప్పుడు వినియోగ దారుల దగ్గర్నుంచి డెలివరీ బాయ్స్ అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డెలివరీ బాయ్స్ అదనపు డెలివరీ చార్జీలు వసూలు చేసిన సంఘటన ఏమైనా ఉంటే వెంటనే సదరు డెలివరీ బాయ్స్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. ఎల్‌పీజీ డీలర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ కస్టమర్లతో ఎప్పటికప్పుడు ఫోన్‌లో వివరాలు సేకరిస్తూ వినియోగదారులకు గ్యాస్ సక్రమంగా సరఫరా అవుతుందో, లేదో తెలుసుకోవాలన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఏజెన్సీలతో పాటు వారి సిబ్బంది మీద కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్‌ఓ ఎ ప్రేమ్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో యువత భవిష్యత్ అంధకారం

అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న అదనపు న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు

కోల్‌సిటీటౌన్, జనవరి 27: మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో యువత భవిష్యత్ అంధకారంలో పడుతుందని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని స్పెక్ట్రా పాఠశాలలో మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసగా మారి తమ జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాల వినియోగంతో రోగ నిరోధక శక్తి క్షీణించడంతో పాటు జీర్ణవ్యవస్థ, ఊపిరితిత్తులు, కాలేయం, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం విద్యార్థులను గమనిస్తుండాలన్నారు. కార్యక్రమంలో లీగల్ సోషల్ వాలంటీర్ ఎం.శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సాయిలీల, సీనియర్ న్యాయవాది బల్మూరి అమరేందర్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రులపల్లి పెద్ద చెరువుకు సాగునీరు విడుదల

మంథనిరూరల్, జనవరి 27: మండలంలోని శాస్త్రులపల్లి గ్రామ పెద్ద చెరువుకు సాగునీరును అధికారులు శనివారం విడుదల చేశారు. చివరి ఆయకట్టు ప్రాంతానికి సాగునీరు అందించాలని ఉద్దేశంతో మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలతో చివరి ఆయకట్ట ప్రాంతమైన శాస్త్రులపల్లి పెద్ద చెరువుకు సాగునీరు విడుదల చేసినట్లు సర్పంచ్ చెన్నవేన సదానందం తెలిపారు. సాగునీరు విడుదల చేయడం వలన చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందన్నారు. సాగునీరు విడుదల చేయించినందుకు మంత్రి శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఎమ్మార్పీఎస్ సమీక్షా సమావేశం

పెద్దపల్లిటౌన్, జనవరి 27: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 29న ఎమ్మార్పీఎస్ సమీక్షా సమావేశం జరగనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోండ్ర శంకర్ తెలిపారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన మాదిగ ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించనున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ రేకుల స్వామి, మాతంగి శంకర్, వడ్లూరి తిరుపతి, గాజుల సురేందర్, పులిపాక సంపత్, పల్లె ప్రేమ్ కుమార్, పల్లె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

మంథనిరూరల్, జనవరి 27: మండలంలోని ఆరెందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే. కుమార్ మాట్లాడుతూ.. రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులు సంపూర్ణ ఆహారం తీసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది రఘునాయక్, సరోజన పాల్గొన్నారు.

మీ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, జనవరి 27 : మండలంలోని మీ సేవా నిర్వాహకుల మండల కమిటీని శనివారం ఎన్నుకున్నారు. మీసేవా సంఘం జిల్లా అధ్యక్షులు నగునూరి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించిన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెప్పాల మహేందర్, సహాయ కార్యదర్శిగా బంక భూమేష్, ఉపాధ్యక్షుడిగా కుంకుమల్ల సత్యనారాయణ, కోశాధికారిగా కనపర్తి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సొల్లూరి రాజేందర్, కన్నం తిరుపతి, అబ్దుల్ ఖదీర్, గట్టు నరేందర్, గుడికందుల సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రామగుండం కమిషనరేట్‌లో భారీగా సీఐల బదిలీలు

25మందికి స్థాన చలనం ● గోదావరిఖని టుటౌన్, పెద్దపల్లి, రామగుండం, ట్రాఫిక్ స్టేషన్లకు కొత్త సీఐలు

కోల్‌సిటీ, జనవరి 27: రామగుండం పోలీస్ కమిషరేట్ పరిధిలో భారీగా సీఐల బదిలీలు జరిగాయి. పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కేంద్ర ఎన్నికల సంఘం నియామవళిని అనుసరించి ఒక పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి స్థానచలనం కలిగించారు. దీంతో పాటు వివాదస్పదులైన అధికారులు, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని మరికొందరికి స్థాన చలనం కల్పించారు. ఈ మేరకు మల్టీ జోన్-1 ఐజీ తరుణ్ జోషి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. రామగుండం కమిషనరేట్ పరిధిలోనే 25మంది సీఐలకు స్థానచలనం కలిగింది. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని సర్కిళ్లలో ఈ మార్పులు జరిగాయి. గోదావరిఖని టుటౌన్, ట్రాఫిక్, రామగుండం, పెద్దపల్లి సీఐలను మార్చారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ-2గా పనిచేస్తున్న ఎన్ ప్రసాద్‌రావును టుటౌన్ సీఐగా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న సూరం వేణుగోపాల్‌ను మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. గోదావరిఖని టుటౌన్ రెండవ సీఐ అఫ్జలోద్దీన్‌ను బెల్లంపల్లి రూరల్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న బీ రాజ్‌కుమార్‌గౌడ్‌ను రామగుండం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు.

పెద్దపల్లి సీఐగా పనిచేస్తున్న బి అనీల్‌ను మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలో లక్సెట్టిపేట సీఐ ఆర్ కృష్ణను నియమించారు. రామగుండం ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్‌ను రామగుండం సీఐగా బదిలీ చేసి అక్కడ పనిచేస్తున చంద్రశేఖర్‌గౌడ్‌ను మల్టీజోన్ ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఐటీ అటాచ్డ్‌లో ఉన్న కే రాంచందర్‌రావును రామగుండం సీసీఎస్-3గా బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్ దేవయ్యను బెల్లంపల్లి టౌన్ సీఐగా బదిలీ చేశారు. బెల్లంపల్లిలో పని చేస్తున్న బన్సీలాల్‌ను శ్రీరాంపూర్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న గంగాధర రమేష్‌ను ఎస్‌బీ 4వ సీఐగా బదిలీ చేశారు. ఎబీ-4సీఐ రాజనర్సయ్యను ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించా రు. రామగుండం టాస్క్‌ఫోర్స్ సీఐ-2 బీ సుధాకర్‌ను చెన్నూరు రూరల్‌కు బదిలీ చేసి అక్కడ పనిచేస్తున్న విద్యాసాగర్‌ను ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. రాజన్న సిరిసిల్లా జిల్లా సీసీఎస్‌లో పని చేస్తున్న కే రవీందర్‌ను చెన్నూర్ టౌన్‌కు బదిలీ చేసి అక్కడ పని చేస్తున్న ఎస్ వాసుదేవరావును ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆదిలాబాద్ రోడ్డు సేఫ్టీ వింగ్‌లో పనిచేస్తున్న బీ రవికి మందమర్రి సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అక్కడ పని చేస్తున్న మహేందర్‌రెడ్డిని ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశించారు.

సీసీఆర్‌బీ రామగుండంలో ఆకుల అశోక్‌ను మంచిర్యాల రూరల్‌కు బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న టీ సంజీవ్‌ను మల్టీజోన్‌కు బదిలీ చేశారు. వరంగల్ నర్‌నూర్ సీఐ కే ప్రేమ్‌కుమార్‌ను మంచిర్యాల ఎస్‌బీ-2గా బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న జీ మొగిలి కరీంనగర్ సీసీఆర్‌బీకి బదిలీ చేశారు. మంచిర్యాల టౌన్ సీఐ ఎం రాజును ఐజీకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌ను కూడా ఐజీకి రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

సుల్తానాబాద్, జనవరి 27: మండలంలోని సుగ్లాంపల్లిలో సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై, డ్రగ్స్, మాదక ద్రవ్యాలపైన తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం తమ ఆటపాటల ద్వారా శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు గుండ్ల స్నేహలత, దయా నర్సింగ్, బుర్ర శంకర్‌గౌడ్, సానకొండ రవిందర్, ఢిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, స్పందన, స్వప్న, శ్వేత, స్పందన పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, జనవరి 27: మండలంలోని కొలనూర్, హరిపురం గ్రామాలకు చెందిన మృతుల కుటుంబాలను అండగా ఉంటామని ఎమ్మెల్యే విజయరమణారావు తెలిపారు. కొలనూర్‌లో శనివారం బావు ఎల్లయ్య మృతదేహం వద్ద నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే హరిపురంలో ఇటీవల మృతి చెందిన కొండపల్కల రాములు కుటుంబాన్ని పరామర్శించి, ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం చేసి బియ్యం బస్తా అందజేశారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోపు నారాయణ రెడ్డి, యాదవ సంఘం నాయకుడు అమ్ముల బిక్షపతి యాదవ్, యేడవెల్లి విజయపాల్ రెడ్డి,గాజుల శివశంకర్ ఉన్నారు.

నేడు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

పెద్దపల్లిటౌన్, జనవరి 27: పెద్దపల్లి మండలం కుర్మపల్లిలో ఆదివారం అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రజలు తరలిరావాలని అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు పిలునిచ్చారు. ఈ మేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐటీ, శాసనసభావ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు కార్యక్రమం మొదలవుతుందని వివరించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, పార్లమెంటు సభ్యుడు వెంకటేష్‌నేత, ఎమ్మెల్యేలు మక్కాన్ సింగ్, కవ్వంపల్లి సత్యనారాయణ, అడ్లూరి లక్ష్మణ్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైన రాజేష్, కాంపెల్లి సతీష్, జిల్లా కోకన్వీనర్ ఇండిబిల్లి రవీందర్ కుమార్, మాటూరి దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పుట్ట మధు పరామర్శ

మంథనిరూరల్, జనవరి 27: మండలంలోని సూరయ్యపల్లి గ్రామానికి చెందిన మంథని రాజమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబాన్ని పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు శనివారం పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంటన టీఆర్‌ఎస్ నేతలు ఆకుల కిరణ్, జంజర్ల లింగయ్యలు ఉన్నారు.

ముత్తారం: మండల కేంద్రంలో ఓ దినపత్రిక రిపోర్టర్ శ్రీధర్ తల్లి ప్రమీల ఇటీవల మృతిచెందగా శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ మృతురాలి చిత్రపటానికి పూలమాలల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం వారి కుటుంబాన్ని పరామార్శించారు. వారి వెంట బిఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పాలకుర్తి,జనవరి 27: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయని వేమునూర్ సర్పంచ్ కోల లత అన్నారు. శనివారం గ్రామపంచాయతీ ఆవరణలో క్రీడాకారులకు క్రికెట్ కిట్టు, వాల్ బాల్ కిట్టుతో పాటు అందజేశారు, మహిళ క్రీడాకారులకు పలు రకాల ఆట వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, పలువురు క్రీడాకారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లలో

సింగరేణి, ఎన్‌టీపీసీదే బాధ్యత

● అధికారులు సమన్వయంతో పనిచేయాలి ● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, జనవరి 27: గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లలో సింగరేణి, ఎన్‌టీపీసీలు బాధ్యత తీసుకోవాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జాతర ఏర్పాట్లపై మేయర్ బంగి అనిల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, సింగరేణి జీఎం చింతల శ్రీనివాస్‌తో కలిసి ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, పోలీస్, రెవెన్యూ, ఎన్‌పీడీసీఎల్, ఆర్‌టీసీ, దేవాదాయశాఖ తదితర విభాగాల అధికారులు, జాతర కమిటీ నిర్వాహకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1992లో ఈ ప్రాంత సింగరేణి కార్మికులు మేడారంనకు వెళితే సింగరేణిలో ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని, సింగరేణి సహకారంతో గోదావరితీరాన జాతర ఏర్పాటు అయ్యిందన్నారు. ఈ ప్రాంత ప్రజలు సింగరేణి, ఎన్‌టీపీసీపై ఆధారపడినవారు, ప్రభావితులేనన్నారు. ఇక్కడ రెండేళ్లకోసారి వైభవంగా జరిగే జాతర ఏర్పాట్లు చూడాల్సిన బాధ్యత సింగరేణి, ఎన్‌టీపీసీదేనన్నారు. ఈ ప్రాంత ప్రజల సంక్షేమం చూడాల్సిన బాధ్యత ఈ సంస్థలపై ఉందన్నారు. సింగరేణి సంస్థ జాతర ఏర్పాట్లు చేయడంతో పాటు గతంలో డంపుయార్డుగా ఉన్న ప్రాంతంలో ఓపెన్‌కాస్టు మట్టి పోయించి చదును చేయాలన్నారు. సింగరేణి, మున్సిపాలిటీలు పారిశుధ్యం, తాగునీరు ఇతర వసతులు కల్పించాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలన్నారు. మరుగుదొడ్లు, మహిళల స్నానపు గదులు, స్నానఘాట్టాల వద్ద బారీకేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, సింగరేణి, మున్సిపల్ ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. జాతరలో విద్యుత్ లైన్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. జాతర నలుమూలలా అన్ని ప్రవేశద్వారాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేయాలని, వీఐపీలతో సహా వాహనాలు లోనికి రాకుండా కట్టడి చేయాలన్నారు. తన వాహనాన్ని కూడా నిర్ధేశించిన ప్రదేశంలోనే పార్కింగ్ చేసి జాతర ప్రాంతానికి వస్తానన్నారు. గద్దెలపై కూడా పూజా కార్యక్రమాలు చేసేవారిని మినహా ఎవరిని అనుమతించవద్దన్నారు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంలో కూడా నియంత్రణ పెట్టాలని, నిర్దేంచిన ప్రదేశంలోనే రాజకీయ పార్టీలు ఇతర సంస్థలు ఫ్లెక్సీలు పెట్టుకునేలా చూడాలన్నారు. జాతర ఏర్పాట్లలో వ్యాపార వర్గాలకు కూడా భాగస్వామ్యం కల్పించాలని, జాతరలో ఎల్‌ఈడీ స్క్రీన్లు, మంచినీరు, జాతర ప్రాంగణం, పట్టణంలో సిరీస్ బల్బులతో సుందరీకరణ ఏర్పాట్లలో వీరిని ప్రోత్సహించాలన్నారు. జాతరకు పది రోజుల ముందే వివిధ శాఖలకు నిర్ధేశించిన పనులను పూర్తి చేయాలన్నారు. ఎన్‌టీపీసీ సంస్థ గోలివాడ జాతర బాధ్యతలు తీసుకోవాలని, గోదావరిఖని జాతర విషయంలో నిర్ధేశించిన పనులను పూర్తి చేయాలన్నారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ స్వీట్లు పంపుతాననడం సరికాదని, ఏర్పాట్లలో భాగస్వామ్యం కావాలన్నారు. జాతర అనంతరం గోదావరి తీరంలో సుందరమైన పార్కు ఏర్పాటు చేయించి ఈ ప్రాంత ప్రజలకు ఆహ్లాదం కలిగేలా చూస్తామన్నారు. సమీక్ష సమావేశంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ అధికారి యుగేందర్, దేవాదాయశాఖ ఈవో కాంతరెడ్డి, ఆర్‌ఎఫ్‌సీఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ వంశీకృష్ణ, ఫైర్ ఆఫీసర్ సత్యనారాయణ, దేవాదాయశాఖ ఈడీ సుజాతరెడ్డి, ఆర్‌టీసీ డీఎం నాగభూషణం, ట్రాన్స్‌కో ఏడీ అడిచర్ల శ్రీనివాస్, జాతర కమిటీ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ ప్రతినిధులు వెంకన్న అయోధ్య రవి, రాజు, సంపత్, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, దాతు శ్రీనివాస్, బొంతల రాజేష్, కొలిపాక సుజాత, జనగామ కవితసరోజిని, పెద్దెల్లి తేజస్విని, కన్నూరి సతీష్‌కుమార్, బాలరాజ్‌కుమార్, ముస్తాఫా, గాదం విజయ, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, ఏగోలపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 27: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ బస్టాండు ప్రాంతంలో కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై శని వారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులతోపాటు చిన్నారికి తీవ్రగాయాల య్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వీర్నపల్లి మండలం భూక్య తండాకు చెందిన దంపతులు పద్మ- సురేశ్‌తోపాటు మూడు నెలల బాబు బైక్‌పై సిరిసిల్ల ఆసుపత్రికి వెళ్లి తిరిగి వస్తు న్నారు. సిద్దిపేటలో ఏఆర్ ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న నిజామా బాద్ జిల్లాకు చెందిన లక్ష్మీనర్సాగౌడ్ కారులో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్నాడు. హరిదాస్‌నగర్ బస్టాండ్ వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో పద్మ- సురేశ్‌తోపాటు బాబుకు తీవ్రగాయాల య్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

30 నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

వేములవాడ, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరా జేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 30వ తేదీ నుంచి త్యాగరాజ స్వామివారి ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నారు. త్యాగరాజ స్వామివారి 71వ ఆరాధనోత్సవాల నిర్వహణ కోసం ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 30వ తేదీ మంగళవారం నుంచి ఫిబ్రవరి మూడవ తేదీ శనివారం వరకు ఐదు రోజులపాటు త్యాగరాజ స్వామి వారి ఆరా దనోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ అధికారులు ఒక ప్రకట నలో తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకా రులు సంగీత కచేరీలు, నృత్య ప్రదర్శనలతో కళాభిమానులను అలరిస్తారని వారు వెల్లడిం చారు.

రాజన్న క్షేత్రంలో కొనసాగుతున్న రద్దీ



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

- మూడు రోజులపాటు గర్భాలయ ప్రవేశం రద్దు

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీరాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోం ది. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు తమ ఇష్టదైవమైన శ్రీరాజరాజేశ్వరస్వామివారిని దర్శించుకుని శ్రీస్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. బాలాత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజ, కళాభవన్‌లో శ్రీస్వామివారి నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతం తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా వారు అమ్మ వారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించు కున్నారు. మేడారం సమ్మక్క, సారక్క జాతర సమీపిస్తున్న తరుణంలో గత కొద్ది వారాలుగా ప్రతినిత్యం వేలాదిమంది భక్తులు వేములవాడకు తరలివస్తున్న క్రమంలో రద్దీ మరింత పెరుగుతుండడంతో శని, ఆది సోమవారాలలో శ్రీ స్వామివారి గర్భాలయ ప్రవేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆదివారం, సోమవారం కూడా శ్రీ స్వామివారి గర్భాలయంలో అభిషేక పూజల భక్తులను అనుమతించమని ఆలయ అధికారులు వెల్లడించారు.

ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ



నరసింహుడి ఆలయంలోకి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

ధర్మపురి, జనవరి 27: ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాది పూజలు, అర్చన లు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్ధలతో పూజించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. యాగశాల వద్ద లోక క్షేమార్థం నరసింహ హోమం జరిపారు. ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు సేవలు అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌కు హైకోర్టు న్యాయమూర్తుల రాక

కరీంనగర్ లీగల్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, కరీంనగర్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ పి.శ్రీసుధ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఇవి వేణుగోపాల్‌రావు కరీంనగర్ జిల్లా కోర్టుకు ఆదివారం రానున్నారు. కరీంనగర్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఐదవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, ఐదవ అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ (జువైనల్ కేసులు) కోర్టు ప్రారంభోత్సవం చేయనున్నారు. వారితో పాటు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి బి ప్రతిమ, ఇతర న్యాయమూర్తులు పాల్గొననున్నారు. కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధ్యక్షుడు బి.రఘునందన్‌రావు, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి నాగరాజులు ఒక ప్రకటనలో కోరారు.

రాజన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ శ్రీనివాసరావుకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఈవో

వేములవాడ, జనవరి 27: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మాధవిదేవి, జస్టిస్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. శనివారం వారు శ్రీ స్వామి వారి దర్శనం కోసం కుటుంబ సమేతంగా వేములవాడకు చేరుకున్నారు.ఆలయ అర్చకులు సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ స్థానాచా ర్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు ఆశీర్వచనము గావించారు. ఆలయ ఈవో డి కృష్ణప్రసాద్ శ్రీ స్వామివారి ప్రసాదం అందజే శారు. సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల జడ్జిలు ప్రేమలత, నీలిమ, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఆర్డీవో మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు

- రాజన్న ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్

వేములవాడ, జనవరి 27: శ్రీ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం దత్తత ఆలయమైన కోనరావుపేట మండలం మామిడిపల్లిలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవాలయ ప్రాంగణంలో ఫిబ్రవరి 9న నిర్వహించే మాఘ అమావాస్య జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆలయ అతిథి గృహంలో శనివారంనిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవస్థానం తరపున తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు తగిన బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. సమావేశంలో వేములవాడ ఆర్డీవో పులి మధుసూదన్, కోనరావుపేట ఎంపీపీ చంద్రయ్యగౌడ్, సెస్ వైస్ చైర్మన్ డి తిరుపతి, మామిడిపల్లి సర్పంచ్ కొక్కుల భారత నర్సయ్య, ఎంపీడీవో రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్, శ్రీరాములు, ఆలయ ఇన్‌చార్జి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కోఆర్డినేటర్‌గా ఎస్ కుమార్



ఎస్ కుమార్

గోదావరిఖని, జనవరి 27: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నా గపూర్, ఆగ్రాలలో జరగనున్న దళిత్ సమ్మేళన్‌కు ఐదు రాష్ట్రాల కో ఆర్డినేటర్‌గా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శి సంజయ్‌నిర్మల్ లేఖ విడుదల చేశారు. నాగపూర్, ఆగ్రాలలో జరగనున్న కార్యక్రమాలకు 25వేల మంది ప్రతినిధులు హాజరయ్యేలా ప్రణాళికలు చేస్తున్నారు. అన్ని రాష్ట్రాల ఎస్సీ మోర్చా కమిటీలు, జిల్లా కమిటీలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజా ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు ఈ సమ్మేళన్‌కు హాజరుకానున్నారు. ఇందుకు గాను సమన్వయానికి బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి అయిన ఎస్ కుమార్‌కు ఏపీ, తెలంగాణ, పాండిచ్చేరి, కర్ణాటక, కేరళ, తమిళనాడు బాధ్యతలు అప్పగించారు.

భార్యను వేధించిన వ్యక్తికి జైలు శిక్ష

కరీంనగర్ లీగల్, జనవరి 27: అదనపు కట్నం కోసం భార్యను వేధించడమే కాకుండా, గుడిసెను తగులబెట్టిన కేసులో చెక్కల శివకృష్ణ (25) అనే వ్యక్తికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, 30 వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారి శనివారం తీర్పునిచ్చారు. ఎల్‌ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాత్మానగర్ చాపలకాలనీకి చెందిన దివ్య (21) అదే కాలనీకి చెందిన చెక్కల శివకృష్ణలు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. మూడు సంవత్సరాలు భార్యతో కలిసి కాపురం చేసిన శివకృష్ణ ఐదు లక్షలు అదనపు కట్నం కావాలని వేధించడంతో పాటు, 2022 అక్టోబర్ 10న అత్తమామలు నివాసం ఉండే గుడిసెను తగులబెట్టాడు. ఈ కేసులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు సాక్షులను కోర్టులో హాజరుపరిచి విచారించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన జడ్జి శివకృష్ణకుక జైలు శిక్ష విధించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గంగాధర, జనవరి 27: గంగాధర మండలం రంగరావుపల్లికి చెందిన గంగాధర ప్రశాంత్(30) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగాధర ప్రశాంత్ డిప్లొమా పూర్తి చేసి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాడు. ఈనెల 25న తనకు సమస్యలున్నాయట్లు గట్టుబూత్కూర్ శివారులో పురుగుల మందు తాగి తన అన్న ప్రవీణ్‌కు ఫోన్ చేశాడు. ప్రవీణ్ తన స్నేహితుడితో కలిసి వెళ్లి చూడగా గుర్తు తెలియని పురుగుల మందు తాగి పడి ఉన్నాడు. కరీంనగర్ తరలించి చికిత్స అందిస్తుండగా ఈ రోజు పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి తండ్రి లచ్చయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మట్టి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మానకొండూర్, జనవరి 27: మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో శనివారం మట్టిని తరలిస్తున్న టిప్పర్‌లను రైతులు అడ్డుకున్నారు. అంబాల్‌పూర్ గ్రామానికి చెందిన 15 మంది రైతుల వ్యవసాయ భూములలో మట్టిని తీసుకునేందుకు గాను జాతీయ రహదారి నిర్మాణ కాంట్రాక్టర్ ఎకరానికి రూ. 68వేల ఒప్పందం కుదుర్చుకున్నారు. 45 రోజులకు నగదు చెల్లిస్తామని చెప్పి మూడు నెలలు దాటినా డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహిస్తు టిప్పర్‌లను అడ్డుకొని నిరసన తెలిపారు. రోడ్డు పనుల సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని రెండుమూడు రోజుల్లో నగదు చెల్లిస్తామని చెప్పడంతో రైతులు వెళ్లిపోయారు.

జన సంద్రం

● కొండగట్టుకు పోటెత్తిన భక్తులు ● రోజంతా నిరంతర దర్శనం



దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



కొండగట్టు ఆలయ పరిసరాల్లో భక్తులు

మల్యాల, జనవరి 27: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో పోటెత్తింది. కొండంతా భక్తజనంతో కిక్కిరిసింది. వచ్చే నెలలో జరిగే మేడారం సమ్మక్క సారలమ్మ జాతన నేపథ్యంలో ముందుగా దేవుళ్లను దర్శించుకుంటుండగా వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. భక్తులతో క్యూలైన్లు నిండిపోయాయి. సీతమ్మ కన్నీటి గుంతల వరకు వరుస కట్టారు. ఆలయ పరిసరాలు, ఆలయ ప్రధాన కార్యలయం భక్తులతో నిండిపోయింది. వాహనాలను బొజ్జ పోతన్న ఆలయం వద్ద నిలిపివేశారు. ఘాట్‌రోడ్డు నుంచి కిందకు వచ్చే వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. భక్తులు ఆలయంలో అంజన్నను దర్శించుకున్న అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారికీ మొక్కులు తీర్చుకున్నారు. దాదాపు ముప్పై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో శ్రీనివాస్ ఇతర అధికారులు, పోలీసులు పర్యవేక్షించారు. భక్తుల రద్దీ రోజంతా నిరంతరంగా కొనసాగింది. వందలాది వాహనాలతో ఘాట్‌రోడ్డు, బొజ్జపోతన పరిసరాలు నిండిపోయాయి.

పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయం

- జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు

కరీంనగర్ టౌన్, జనవరి 27: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, పెద్దపల్లి జిల్లా విద్యాధికారి మాధవి, మంథనికి చెందిన ప్రవాసభారతీయుడు డాక్టర్ అశోక్ కాచే అన్నారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో బేసిక్ రిసెర్చ్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ (బ్రెడ్) సొసైటీ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులకు పుస్తక పఠనం, గ్రంథాలయ నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవోలు మాట్లాడుతూ రాష్ట్రంలో 610 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బాలల గ్రంథాలయాలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 130 బాలల గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కాచే సేవలను కొనియాడారు. ఈసమావేశంలో బ్రెడ్ సొసైటీ ఉపాధ్యక్షులు విజయ్ సాయి మేఖ, శశి భూషణ్ కాచె, శ్రీనివాస్ కాచె, వరహాల శ్రీనివాస్, 80 పాఠశాలల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై మోసం చేసిన వ్యక్తిపై కేసు

మెట్‌పల్లి, జనవరి, 27: మెట్‌పల్లి పట్టణ అనుసంధ గ్రామైనా వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన యువతికి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్‌రావుపేట గ్రామానికి చెందిన వివాహితకు కొంతకాలం క్రితం వివాహమైంది. అనంతరం విడాకులు తీసుకుని ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో నిజామాబాద్ జిల్లా నవీపేట్ గ్రామానికి చెందిన ఈశ్వర్ అను వ్యక్తి రెండేళ్ల క్రితం పరిచయమయ్యాడు. కాగా కొన్ని రోజుల నుంచి వీరి మధ్య ప్రేమాయణం కొనసాగింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఈశ్వర్ ఆమె వద్ద నుంచి లక్ష రూపాయల వరకు తీసుకున్నాడు. కొద్ది రోజులుగా పెళ్లి చేసుకోవాలని వివాహిత కోరుతున్నా మాట దాటువేస్తూ కాలం వెళ్లదీసాడు. దీ తో మోసపోయినట్లు గుర్తించిన వివాహిత ఈశ్వర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించిన ఇద్దరి రిమాండ్



పోలీసులకు రివార్డు అందజేసిన ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 27: బైక్‌పై వచ్చి పుస్తెలతాడు దొంగిలించి పరారైన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని పెద్దగుండవెల్లికి చెందిన బోదాసు నరేశ్ (30), పద్మనాభంపల్లికి చెందిన సిద్ధన యాదవ్వ (33)ను రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 12వ తేదీన తంగళ్లపల్లి మండలం జిల్లెల్లకు చెందిన రుద్రాపు పోషవ్వ అనే వృద్ధురాలు జ్వరంతో బాధపడుతూ ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లింది. తిరిగి ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని జంట బైక్‌పై వచ్చింది. ఇంటివద్ద దింపుతామని నమ్మించి ఆమె మెడలోని పుస్తెల తాడును తెంపుకొని పారిపోయింది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ విచారణ చేపట్టారు. ప్రత్యేక బృందం ద్వారా జిల్లెల్ల, నేరెళ్ల, ముస్తాబాద్ ప్రాంతాల్లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. వాటి ఆధారంగా శుక్రవారం సాయంత్రం బద్దెనపల్లి క్రాస్‌రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న బోదాసు నరేశ్, సిద్ధన యాదవ్వను అదుపులోకి తీసుకొని విచారించగా దోపిడీ వ్యవహారం బయటపడింది. సులువుగా డబ్బులు సంపాదించవచ్చని దోపిడీలకు పాల్పడుతున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చెప్పే మోసపూరిత మాటలను నమ్మవద్దని అన్నారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్, ఆర్ఎస్సై జునైద్, కానిస్టేబుళ్లు నరేందర్, రాజశేఖర్, శ్రీనివాస్, అక్తర్‌కు రివార్డు అందజేశారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు



విద్యార్థుల పత్రాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

తిమ్మాపూర్/రామగిరి, జనవరి 27: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే తొలివిడ త జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కరీంనగర్‌లోని అల్‌ఫోర్స్ మహిళా డిగ్రీ అండ్ పీజీ, వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, వాణినికేతన్ డిగ్రీ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రామగిరి మండలంలోని సెంటినరీకాలనీ జేఎన్‌టీయూలో జేఈఈ మెయిన్స్ ప్రవేశపరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 93 మంది, మధ్యాహ్నం 92 మంది పరీక్షలకు హాజరయ్యారు.ఉదయం 9 నుంచి 12గంటల మొదటి సెషన్‌లో 1,309మందికి 1,297మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండో సేషన్‌లో మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు 1,309 మందికి 1,301మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఫిబ్రవరి 1వ తేదీ వరకు కొనసాగనున్నాయి. రెండు గంటల ముందు నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. విద్యా ర్థులను క్షుణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి అనుమ తిం చామని ఎన్‌టీఏ సీటీ కోఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

భార్యను కిడ్నాప్ చేశారంటూ భర్త ఫిర్యాదు

గొల్లపల్లి, జనవరి 27: మండలంలోని చెందోళి గ్రామంలో ఇంట్లో ఉన్న తన భార్య సౌమ్యను ఆమె కుటుంబ సభ్యులు మరికొందరు కలిసి అపహరించారని భర్త రేగుల రాకేష్ గొల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రేగుల రాకేష్, ఎనగందుల సౌమ్య ప్రేమించుకుని ఈ నెల 3వ తేదీన వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి ఇద్దరు కలిసి రాకేష్ ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో సౌమ్య తండ్రి ఎనగందుల చంద్రమౌళి, కట్కూరి రమేష్, దొనకొండ స్వామి ఇంటిలో ఉన్న సౌమ్యను బలవంతంగా తీసుకెళ్లారు.. భర్త రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ 27: జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14, 17, 19 క్రీడాకారుల టగ్ ఆఫ్ వార్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చెంజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం ఉదయం 9 గంటలనుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల క్రీడాకారులు ఫొటోతో కూడిన అర్హత సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో హాజరుకావాలన్నారు. అండర్-19 క్రీడాకారులు పదో తరగతి మెమోలతో హాజరుకావాలని ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరు వాహనదారులకు జైలు

కరీంనగర్ క్రైం, జనవరి 27: కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరు వాహనదారులకు జైలు శిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మోతాదుకు మించి మద్యం సేవించి తనిఖీలలో పట్టుబడిన 15 మంది వాహనదారులను శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 5 రోజులు, మరొకరికి 3 రోజులు జైలుశిక్ష, రూ.3,500లు విధించారని తెలిపారు. మరో 13 మంది వాహనదారులకు రూ.21,500లు జరిమానా విధించినట్లు తెలిపారు.

స్వగ్రామం చేరుకున్న మృతదేహం

చందుర్తి, జనవరి 27: చందుర్తి మండల కేంద్రానికి చెందిన కైర నాగయ్య (55)అనే వ్యక్తి సౌదీ అరేబియాలో మృతి చెందగా శనివారం మృతదేహం స్వగ్రామానికి తీసుకొచ్చారు. నాగయ్య జీవనోపాధి కోసం 30 సంవత్సరాలుగా గల్ఫ్ వెళ్లి వస్తున్నాడు. 10 సంవత్సరాల క్రితం సౌదీ వెళ్లిన నాగయ్యకు 20 రోజులు క్రితం పక్షవాతం వచ్చింది. అక్కడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.

పశుగ్రాసం దగ్ధం

ఓదెల, జనవరి 27: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో శనివారం ఎంబాడి సమ్మయ్య అనే రైతుకు చెందిన పశుగ్రాసం కుప్ప నిప్పంటుకొని దగ్ధమైంది. రెండు నెలల క్రితం రైతు కొంత భూమిని కౌలుకు తీసుకుని వరి పంట వేసి పంటను పూర్తి చేసుకోగా అనంతరం మిగిలిన నాలుగు ఎకరాల గడ్డిని కుప్పగా పేర్చాడు. ప్రమాదవశాత్తు నిప్పంటుకొని పూర్తిగా దగ్ధమైంది. సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకుని నీరు పోసి మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పింది.

రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసిన కేసులో మరో ముగ్గురి అరెస్టు

హుజూరాబాద్, జనవరి 27: హుజూరాబాద్ పట్టణంలో నాలుగు రోజుల క్రితం రేషన్ బియ్యం అక్రమ నిల్వ చేసిన కేసులో పరారిలో ఉన్న ముగ్గురిని టౌన్ సీఐ బొల్లం రమేశ్ అరెస్టు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల క్రితం 250 క్వింటాళ్ల రేషన్ బియ్యం మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన కేసులో ఏ1గా ఉన్న శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామనరి చెప్పారు. కాగా పరారిలో ఉన్న ముగ్గురు బోర్నపల్లికి చెందిన పిల్లి శ్రీధర్, శంకరపట్నం మండలం మెట్‌పల్లికి చెందిన అంగిడి రమేష్, ఇల్లందకుంట మండలం మల్యాలకు చెందిన తిరుపతి సురేష్‌ను అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు.

ఇసుక లారీల తనిఖీ

మంథని, జనవరి 27: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కూచిరాజ్ ఎల్ల వద్ద మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పై ఇసుకల లారీలను, టిప్పర్లను టీఎస్ఎండీసీ అధికారులు శనివారం రాత్రి తనిఖీ చేశారు. మంథని, ముత్తారం మండలాల్లోని వివిధ ఇసుక క్వారీల నుంచి రవాణా అవుతున్న ఇసుక లారీలు, టిప్పర్లను టిఎస్ఎండీసీ ఎస్ఆర్‌వోలు రాజుకుమార్, అరవింద్ తనిఖీలు చేపట్టారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్, జనవరి 27: తెలంగాణ షార్ట్ ఫిలిం మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్-204ను మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో శనివారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 500లకు పైగా కళాకారులు, ఫిలిం మేకర్లు మంచి చిత్రాలు రూపొందిస్తూ దేశ వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సంపాదించడం సంతోషకరమన్నారు. క్రీడలు ఆరోగ్యానికి బాగా ఉపయోగపడతాయని చెప్పారు. కళాకారుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ షార్ట్ మేకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అయిలు రమేశ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గన్నమనేని నర్సింగరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ప్రధాన కార్యదర్శి సీతామలక్ష్మి, ఇతర సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ పంపిస్తానంటూ మోసం

- ఏజెంట్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుల నిరసన



మెట్‌పల్లిలో నకిలీ వీసాలు చూపుతున్న బాధితులు

మెట్‌పల్లి, జనవరి 27: విదేశాలలో జీవనోపాధి కల్పిస్తానని డబ్బులు తీసుకొని మోసం చేసిన గల్ఫ్ ఏజెంట్ యేలేటి రమేష్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితులు ఆయన ఇంటి ఎదుట నిరసన తెలిపారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో పనులు లేక ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లడానికి పట్టణంలోని యేలేటి రమేష్‌ను కొంత మంది సంప్రదించారు. సదరు ఏజెంట్ దుబాయ్‌కి పంపిస్తానని బాధితులు ఒక్కొక్కరి వద్ద నుంచి రూ. 60వేలు తీసుకొని వీసా కాపీలను ఇచ్చి పంపించాడు. వీసాలు తీసుకున్న బాధితులు ఎన్నో ఆశలతో దుబాయి వెళ్లేందుకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బయల్దేరారు. తీరా అక్కడకు వెళ్లిన బాధితులకు అవి నకిలీ వీసాలని అధికారులు గుర్తించి తెలపడంతో షాక్‌కు గురయ్యారు. ఏజెంట్ చేతిలో మోసపోయినట్లు గుర్తించిన 40 మంది బాధితులు ఆగ్రహంతో ఏజెంట్ ఇంటికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పనులు

● సభ్యుల ఆరోపణ ● అధికారుల తీరుపై ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం ● వాడీవేడిగా ధర్మారం మండల సర్వసభ్య సమావేశం

ధర్మారం, జనవరి 27: గ్రామాల్లో చేపట్టిన మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా చేయడం వలన పైపులు లీకేజీ అయి నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతుందని సభ్యులు ఆరోపించారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ అధ్యక్షతన శనివారం జరిగిన ధర్మారం మండల సర్వసభ్య సమావేశానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజా సమస్యలపై మండల సభ వాడీవేడిగా సాగింది. మిషన్ భగీరథ పథకం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పైపులు లీకేజీ అయిన గృహాల్లోకి తాగునీరు చేరడం లేదని సభ్యులు ఆవేదనను వెలిబుచ్చారు. గ్రామంలో తాత్కాలికంగా పైపులను మరమ్మతులు చేసి నీటిని అందించిన నీటి ఉధృతికి పైపులు పగులుతున్నాయని కనీసం మిషన్ అధికారులకు తెలియపరిచిన పట్టించుకోవడం లేదని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆరోపించారు. అధికారులు సమన్వయంతో పనిచేయడం లేదని సభ్యులు ఆరోపించారు. మిషన్ భగీరథ అధికారుల పనితీరుపై ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో నీటి సరఫరాపై అధికారులను ఆయన వివరాలను అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలు, ఎక్కడెక్కడ పైపుల లీకేజీలు ఉన్నాయో సమగ్రంగా నివేదించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతీ సర్వసభ్య సమావేశానికి హాజరుకావడం లేదని సభ్యులు ఆరోపించారు. మండలస్థాయి అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన ఎంపీడీవోకు సూచించారు. గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు అందలేదని వాటిని సర్పంచ్‌లకు అందేలా చూడాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు ఆధ్వర్యంలో సర్పంచ్‌లు ప్రభుత్వ విప్‌నకు విన్నవించారు. పంటలను సాగు చేసే సమయంలో వ్యవసాయ అధికారులు రైతులకు సరైన సలహాసూచనలు ఇవ్వడం లేదని సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం నాటు వేసిన పంటలకు మొగి పురుగు వస్తోందని నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలపై మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి ప్రభుత్వ విప్‌నకు తెలియజేశారు.




ధర్మారంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, ఓదెలలో సన్మానం పొందిన సర్పంచ్‌లు

● గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి : ప్రభుత్వ విప్

సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో గ్రామాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేరుస్తోందని ఆయన చెప్పారు. పార్టీలకతీతంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజావసరాలను తీర్చడానికి ప్రయత్నిస్తానని అన్నారు. సాగు, తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ఐదు రోజుల్లో ముగుస్తున్న దృష్ట్యా పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. సాంకేతికపరంగా ఏమైన మిగులు పనలు ఉంటే తన దృష్టికి తీసుకువచ్చి సర్పంచ్‌లు పూర్తిచేయాలని ఆయన అన్నారు.

● భావోద్వేగానికి గురైన ఎంపీపీ...

మండల సభలో ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ భావోద్వేగానికి గురయ్యారు. ఐదేళ్ల పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీ, అధికారులు కలిసికట్టుగా అభివృద్ధి పనులు చేశామన్నారు. అందరి కృషి ఫలితంగా స్వచ్ఛతలో మండలానికి అవార్డు వచ్చిందన్నారు. మహిళా సాధికారతలో ప్రగతిని సాధించామన్నారు. ఐదు రోజుల్లో సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవుతుందని ఎంపీపీ కరుణశ్రీ భావోద్వేగానికి గురయ్యారు. సభలో ఉన్న సభ్యులు సైతం భావోద్వేగానికి గురయ్యారు. ఎంపీటీసీల పదవీ కాలం పూర్తయ్యేంత వరకు సర్పంచ్‌లు సలహా, సూచనలు ఇవ్వాలని ఆమె కోరారు. ప్రజలు సర్పంచ్‌లపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా అన్ని విధాల అభివృద్ధి చేశారని జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ అభినందించారు. గ్రామాల్లో చేపట్టిన పనుల పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.

● లక్ష్మణ్‌కుమార్‌కు ప్రజాప్రతినిధుల సన్మానం

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మండల సభలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలారాం రెడ్డి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి సన్మానించారు. అదేవిధంగా సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తున్న దృష్ట్యా సర్పంచ్‌లను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ, జిల్లా సహకార సంఘాల చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు పూస్కూరి పద్మజ, అధికారులు సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో బి జయశీల, తహసీల్దార్ రజిత, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ మేడవేని తిరుపతి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

● ఓదెలలో సర్పంచ్‌లకు సన్మానం..

ఓదెల: మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ రేణుకాదేవి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సర్పంచ్ పదవిలో ఐదేళ్లపాటు కొనసాగినప్పటి నుంచి ఇప్పటివరకు కూడా గోపరపల్లి రెడ్డి కాలనీకి మిషన్ భగీరథ నీరు రాలేదని సర్పంచ్ మల్లారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఐదేళ్లపాటు కొనసాగిన సర్వసభ్య సమావేశాలు అభివృద్ధికి ఏ మాత్రం కూడా ఉపయోగపడ లేదని సభ్యులు నిస్సహాయత వ్యక్తం చేశారు. అనంతరం ఈ నెలతో సర్పంచుల పదవీ కాలం ముగియనుండగా సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గంట రాములు, సర్పంచులు ఆళ్ల రాజిరెడ్డి, అంకం రమేష్, గుండేటి మధు, కర్క మల్లారెడ్డి, సామ మనెమ్మ, గుగులోత్ లక్ష్మి, పోతుగంటి రమ, ఒజ్జ కోమలత, తెలుసూరి కొమురయ్య, పత్తి మాలతి, పల్లె ఓదెలు, గోవిందుల ఎల్ల స్వామి, తిప్పారపు చిరంజీవి, కోట దామోదర్ రెడ్డి, ఎంపీటీసీలు, అలాగే ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజిద్, ఎంఈవో రాజయ్య, పిఆర్, ట్రాన్స్ కో ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

తాజుద్దీన్ బాబా జయంతి వేడుకలు

కళ్యాణ్‌నగర్, జనవరి 27: గోదావరిఖనిలో శనివారం తాజుద్దీన్‌బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు నారదాసు సతీష్‌రావు ఆధ్వర్యంలో గోదావరిఖని చౌరస్తా నుంచి పల్లకిసేవతో రీగల్ షూమార్ట్, కళ్యాణ్‌నగర్, తిరుమల్‌నగర్ గుండా కాకతీయనగర్‌లోని తాజుద్దీన్ బాబా దర్బార్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మహిళలు కోలాట నృత్యాలు చేస్తూ, బాణాసంచా కాల్చుతూ ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం బాబా దర్బార్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి సహపంక్తి భోజనం చేశారు.

దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు



దర్గాలో చాదర్ కప్పుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 27: గోదావరిఖని సప్తగిరికాలనీలోని తాజుద్దీన్ బాబా దర్గాలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చాదర్ కప్పి జెండాను ఎత్తారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహంకాళి స్వామి, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, గడ్డం శ్రీనివాస్, క్యా శ్రీనివాస్, నాజీమోద్దీన్ పాల్గొన్నారు.

ముగిసిన ఉర్సు ఉత్సవం

రామగిరి, జనవరి 27: రామగిరి మండలంలోని బేగంపేట్ గ్రామంలో పీర్‌పహాడీ బాబా ఉర్సు ఉత్సవం శనివారం ముగిసింది. ఉదయం పీర్‌పహాడీ దర్గా పైకి పెద్దసంఖ్యలో ముస్లిం మతపెద్దల సమక్షంలో సందల్(గంధం)ను తరలింపు చేపట్టారు. ఎంపీపీ ఆరెల్లిదేవక్క హాజరై చాదర్‌ను సమర్పించారు. కుల, మతాలకు అతీతంగా నిర్వహించిన ఉర్సు ఉత్సవానికి వివిధ జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

'బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి'

పెద్దపల్లిటౌన్, జనవరి 27: మట్టిమాఫియా చేస్తున్న బెదిరింపుల నుంచి తనను రక్షించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పెద్దపల్లికి చెందిన మట్టి వ్యాపారి సానికొమ్మ రాంరెడ్డి అధికారులను కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాంరెడ్డి మాట్లాడుతూ పెద్దపల్లి మండలం మద్దికుంట గ్రామ శివారులోని సర్వేనంబర్ 390లో మూడెకరాల 34గుంటల్లో ప్రభుత్వ అనుమతులను పొంది మట్టి క్వారీ నడిపిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకున్నా కొంత మంది వ్యక్తులు మట్టిని తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆరోపించాడు. ప్రభుత్వానికి వే బిల్లులు చెల్లిస్తూ వ్యాపారం చేసుకుంటున్న తనను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. జిల్లా అధికారులు ఇప్పటికైనా కల్పించుకొని తనకు న్యాయం చేయాలని రాంరెడ్డి కోరాడు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 27: పెద్దపల్లి మండలం రాఘవపూర్‌లో ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్‌లపై చర్యలు తీసుకోవాలని రాఘవపూర్ గ్రామానికి చెందిన తాడిశెట్టి శ్రీకాంత్ శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాఘవపూర్ శివారు సర్వే నెంబర్ 1116 ఎకరం ఐదు గుంటల వ్యవసాయ భూమిని చదును చేసి ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమ వెంచర్‌ల వల్ల గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి పడిందన్నారు. వెంటనే అక్రమ వెంచర్‌లపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అశ్విని

ధర్మారం, జనవరి27: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ధర్మారం ఎస్సై 2 అశ్విని అన్నారు. శనివారం ధర్మారం మండలం పత్తిపాక ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా వాహనదారులకు ఆమె అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాలను అతివేగంగా నడిపి ప్రమాదాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వాహనాలను నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమె తెలిపారు. రోడ్డు మార్గం గుండా క్షేమంగా ఇంటికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

రామగిరి, జనవరి 27: రోడ్డు ప్రమాదాల భద్రతపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ రవిప్రసాద్ ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన ట్రాఫిక్ రూల్స్, రోడ్డుసేఫ్టీ అంశాలను వివరించారు. వాహనాలకు సంబంధించిన పేపర్లు విధిగా తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మద్యం సేవించి నడపడం వల్లే జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిందిగా సూచించారు. మద్యం తాగి నడిపినా, సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలను నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పెద్దపల్లిటౌన్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు సంఘం సాధనలో భాగంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను పలు సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. తమ ద్వారా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో కలిసి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రాన్ని అందించారు. దీనికి మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే ముఖ్యమంత్రితో చర్చించి మేనిఫెస్టోలో పొందుపరిచినటువంటి మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం రాష్ట్ర కన్వీనర్ చింతపండు మహేందర్‌పటేల్, మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షులు బండి సంజీవ్‌పటేల్, మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్, వివిధ సంఘాల రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో ఈర్ల సమ్మయ్య ప్రతిభ

కాల్వశ్రీరాంపూర్, జనవరి 27: నల్గొండ జిల్లాకు చెంది ఎరెడ్ల రంగనాయకమ్మ, ఝాన్సీరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉభయ రాష్ట్రాల స్థాయి పాటల పోటీల్లో పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ఎస్‌సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య తృతీయ స్థానంలో నిలిచారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి రాష్ట్ర స్థాయి పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించగా ఈర్ల సమ్మయ్య(పెద్దపల్లి) తృతీయ స్థానాల్లో నిలిచారు. యూట్యూబ్‌లో వచ్చిన వ్యూస్ ఆధారంగా ఈ ఎంపిక చేసినట్టు నిర్వాహకులు కమలాకర్‌రెడ్డి తెలిపారు.

పాటల పోటీల్లో తృతీయ స్థానంలో నిలిచిన ఈర్ల సమ్మయ్యకు శనివారం ప్రశంసాపత్రంతో పాటు రూ.1116 నగదు బహుమతి అందజేశారు. తన గెలుపునకు సహకరించిన మిత్రులు, శ్రేయోభిలాషులకు, ప్రతి క్కరికి ఈర్ల సమ్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన

అంతర్గాం, జనవరి 27: రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియా రైల్వే స్టేషన్ ప్రాంతంలో రూ.40లక్షలతో నిర్మిస్తున్న కాల్వ నిర్మాణ పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో తంబడి శంకర్, కలవేని మల్లేష్, శ్రీనివాస్ ఉన్నారు.

విద్యార్థులు
దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కోల్‌సిటీటౌన్, జనవరి 27: విద్యార్థులు దేశ భవిష్యత్.. మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని విద్యలో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం సాయంత్రం గోదావరిఖని సప్తగిరి కాలనీలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, కళాశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తున్న సొసైటీ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్పొరేటర్ మహంకాళి స్వామి, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు

మంథని, జనరి 27: మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలలో 2024లో భాగంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బాయ్స్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, గర్ల్స్ హైస్కూల్ మంథని విద్యార్థులు ద్వితీయ స్థానంలో, గుంజపడుగు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. తెలుగు మీడియం విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ ఆరెంద విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రైవేట్ విభాగంలో కాకతీయ హై స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో, కృష్ణవేణి హై స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో, మేరీ మీడియా ట్రిక్స్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఈ పరీక్షల్లో ప్రథమ స్థానంలో నిలిచిన బాయ్స్ మంథని విద్యార్థులు, కాకతీయ హై స్కూల్ విద్యార్థులు, ఆరెంద విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి దాసరి లక్ష్మి, మండల నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్ వివిధ పాఠశాలల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కానుగంటి శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్, సైన్స్ టీచర్లు, సీఆర్‌పీ మల్లన్న పాల్గొన్నారు.

● జిల్లా స్థాయిలో నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాలకు మంథని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రదీప్‌రెడ్డి శనివారం తెలిపారు. 10వ తరగతి విద్యార్థి జే. సూర్యమణిదీప్, 9వ తరగతి విద్యార్థి ఎం. సహృదయం, 8వ తరగతి విద్యార్థినీ టీ. శ్రీనిధిలు మొదటి బహుమతి సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. స్కూల్ డైరెక్టర్లు రవికిరణ్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శ్రావణ్‌రెడ్డి, స్రవంతి, ఉపాధ్యాయులు అభినందించారు.

కాల్వ శ్రీరాంపూర్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ సానంలో తారుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఎంబాడి మోహిత్, దోభిల అక్షిత్ ద్వితీయ స్థానంలో వెన్నంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన కే రాంచరణ్, ఎస్ రాంచరణ్, కే ప్రశాంత్, తృతీయ స్థానంలో పెగడపల్లికి చెందిన భరత్, రష్మిక, అజయ్‌కుమార్ నిలిచారు. ఎంఈవో సిరుమల్ల మహేష్, హెచ్‌ఎంలు సునీత, శ్యామ్‌సుందర్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణరావు విద్యార్థులను అభినందించారు.



తారుపల్లిలో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో

ముత్తారం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్షల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముత్తారం విద్యార్థులు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. రక్షిత ఇంద్రాణిలు ప్రథమ స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మాదేవి, ఉపాధ్యాయులు రావి శ్రీనివాస్, రవి, నారాయణరావు, కేజీబీవీ ఉపాధ్యాయులు మనోలత పాల్గొన్నారు.

రామగుండం కార్పొరేషన్ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

కోల్‌సిటీ, జనవరి 27: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రతి డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శనివారం 7వ డివిజన్ పరిధిలోని గోదావరిఖని పవర్‌హౌస్‌కాలనీలో రూ.20 లక్షల పట్టణ ప్రగతి నిధులతో ఓపెన్ డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లు అభివృద్ధి చేస్తామన్నారు. ఎవరికీ ఏ ఇబ్బందులు ఉన్నా ప్రజలు తనకు వద్దకు రావచ్చునన్నారు. మేయర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ రాజ్‌ఠాకూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలరోజుల్లోనే అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయన్నారు. గోదావరిఖనిలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్‌లో రూ.40కోట్లతో రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాల నిర్మాణ పనులు ప్రారంభంకానున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేశ్వర్, స్థానిక కార్పొరేటర్ ఏగోలపు రమాదేవి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

● ఘనంగా మల్లన్న పుట్ట బంగారం..

కళ్యాణ్‌నగర్: గోదావరిఖని యాదవ సంఘం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మల్లన్న బోనాలు, పట్నాలు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన పుట్ట బంగారం కార్యక్రమానికి పెద్ద ఎత్తున యాదవ కుటుంబాలు తరలివచ్చాయి. మొదటిరోజు పుట్ట బంగారం సందర్భంగా మల్లికార్జున్‌నగర్‌లోని కార్యాలయం నుంచి ఊరేగింపుగా డప్పులు, నృత్యాలతో అడ్డగుంటపల్లి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కాన్‌సిం గ్ రాజ్‌ఠాకూర్, మనాలి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే యాదవ సంఘం నాయకులతో కలిసి నృత్యాలు చేశారు. కార్యక్రమం లో కార్పొరేటర్లు మహంకాళి స్వామి, పెద్దెల్లి తేజస్విని, యాదవ సంఘం నాయకులు కాల్వ లింగస్వామి, పాతిపెల్లి రవి, నాయిని ఓదెలు, గుంపుల ఓదెలు, లింగమూర్తి, బోయిని మల్లేష్, బాపు ఐలయ్య పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

నిందితులపై చర్యలు తీసుకోవాలి

మంథని, జనవరి 27: దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మీసాల డానియల్ మంథని పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడు పేర్కొన్న వివరాల ప్రకారం.. మంథని మండలంలోని సూరయ్యపల్లి గ్రామ శివారులోని ఇంటి నెంబర్ 2-86/6 అనే ఇంటిలో రాఘవ ఆగ్రో ఇంజనీరింగ్ వర్క్స్ పేరిట వ్యాపారం తొమ్మిది సంవత్సరాలుగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాపానికి సంబంధించిన ఇల్లును మంథని నివాసి ఒల్లాల సత్యనారాయణ నుంచి లిఖితపూర్వకంగా అగ్రిమెంట్ ప్రకారం కిరాయి తీసుకున్నట్లు తెలిపారు. మంథని పట్టణానికి చెందిన కొంతం సత్యనారాయణ, కొంతం మోహన్ కొంతం హరిప్రసాద్ దౌర్జన్యంగా ట్రాక్టర్లతో మట్టి తవ్వించి వర్క్ షాప్ ముందర మట్టి కుప్పలు పోశానారని, తనకు సంబంధించిన షెడ్డు, వెల్డింగ్ మిషన్, వర్క్ షాప్‌నకు సంబంధించిన సామగ్రి కొందరు తొలగించారని వాపోయారు. తనను, తన షాప్‌లో పనిచేసే ధనుంజయ్‌ని చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మట్టి కుప్పల కింద షాప్‌నకు సంబంధించి పది లక్షల రూపాయల వరకు నష్టం జరిగిందని బాధితుడు తన ఫిర్యాదులో తెలిపారు. దౌర్జన్యంగా వచ్చి నష్టం చేసిన వ్యక్తులపైన వారి అనుచరుల పైన వెంటనే చట్టరీత్యా చర్య తీసుకొని న్యాయం చేయాలని కోరారు.



ఘనంగా టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

గోదావరిఖని, జనవరి 27: టీబీజీకేఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక ప్రధాన చౌరస్తాలోని కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌జీ-1 ఉపాధ్యక్షులు గండ్ర దామోదర్‌రావు, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమురయ్య ముఖ్యఅతిథిగా హాజరై జెండావిష్కరించారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ దివంగత కొత్తపల్లి జయశంకర్ ఆధ్వర్యంలో పురుడు పోసుకున్న టీబీజీకేఎస్ మొట్టమొదటి సారిగా ఒక డివిజన్ గెలిచి అనంతరం గుర్తింపు సంఘంగా అవతరించి కార్మికుల సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ నాయకులు పర్లపల్లి రవి, వెంకటేష్, శంకర్, మల్లారెడ్డి, మల్లయ్య, తిరుపతి, సాయికృష్ణ, చెలుకలపెల్లి శ్రీనివాస్, సురేందర్, శంకర్, రాజ్‌కుమార్, రాజు, భాస్కర్‌రెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలను అందజేయాలి

రామగిరి, జనవరి 27: సాధారణ ఎన్నికల కోడ్ నేపథ్యంలో నిలిచిపోయిన కారుణ్య నియామకాలు, ఎక్స్‌ట్రానల్ పత్రాలను అందజేయాలని శనివారం ఆర్జీ-3 పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా నాలుగు మాసాలుగా సుమారు ఆరు వందల మందికిపైగా నియామక పత్రాల కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. తిరిగి పార్లమెంట్ ఎన్నికల సంబంధించిన షెడ్యూల్ రాబోతున్న తరుణంలో అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, వారికి తక్షణం నియామక పత్రాలను అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వైవీ రావు, జూపాక రాంచందర్, ఎంఆర్‌సీ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో
ఉద్యోగాల కుంభకోణంపై దర్యాప్తు జరపాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 27: రామగుండం ఎన్టీపీసీ ఉద్యోగాల కుంభకోణంపై దర్యాప్తు చేయాలని బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి అన్నారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం కుందనపల్లి, మొగల్‌పహాడ్, బ్రహ్మ్రిపల్లి, లింగాపూర్‌తో పాటు అనేక మంది రైతులు తమ భూములను త్యాగం చేశారన్నారు. రైతులు భూములు ఇస్తే తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని ఆశతో ఎదురు చూశారని, కానీ ఒక్కరికి కూడా ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. నవరత్న కంపెనీ అయిన ఎన్టీపీసీ నిరుద్యోగుల జీవితాల్లో మట్టికొట్టిందని, ఎంతో మంది బీటెక్, ఐటీఐ, డిప్లొమా చేశారని, కానీ నిరుద్యోగ యువకులకు ఉద్యోగాలు కల్పించడంలో ఎన్టీపీసీ విఫలమైందని ఆరోపించారు. ఒక్కొక్క ఉద్యోగానికి మూడు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు తీసుకుంటున్నారని, ఎన్టీపీసీ అధికారులు, బడా నాయకులు కుమ్మక్కై ఉద్యోగాలు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. దీనికి బాధ్యులైన అధికారులపై విజిలెన్స్ విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కందుల సంధ్యారాణి

సర్పంచ్‌లకు సన్మానం



సర్పంచ్‌లతో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 27: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో పాలకుర్తి, అంతర్గాం మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ సర్పంచ్‌లను మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో పల్లె ప్రగతి కార్యక్రమం తీసుకుని వైకుంఠధామం, డంప్‌యార్డు, పల్లె ప్రకృతి వనాలు, చెత్త సేకరణ ట్రాకర్లు ఏర్పాటు చేసి పల్లెలను సుందరంగా తీర్చిదిద్దారన్నారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చించి చేసిని అభివృద్ధిని మనం చెప్పుకోని కారణంగానే పార్టీకి, మనకు నష్టం జరిగిందన్నారు. ఈ నెల 31వ తేదిన సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తుందని, తిరిగి ఎన్నికలు నిర్వహించే వరకు సర్పంచ్‌లను స్పెషల్ పర్సన్ ఇన్‌చార్జిగా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులను ఇబ్బందులు పెడితే వారికి బీఆర్‌ఎస్ పార్టీ, తాము అండగా ఉంటామని చెప్పారు. రాబోయే కాలంలో సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు అందరూ కేసీఆర్ గారి నాయకత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆముల నారాయణ, నాయకులు కౌశిక హరి, వైస్‌ఎంపీపీ మట్ట లక్ష్మిమహేందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.